పల్లెదారుల్లో పచ్చందాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని మార్కండేయ నగర్ కాలనీ నుంచి వెంకటాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర పచ్చని చెట్లు కనువిందు చేస్తున్నాయి. ఎనిమిదేళ్ల క్రితం హరితహారంలో నాటిన మొక్కలు.. నేడు ఏపుగా పెరిగి పచ్చదనాన్ని పంచుతున్నాయి. ఎర్రటి ఎండలో కూడా ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులకు నీడనిస్తూ ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి.



ఏపుగా పెరిగి పచ్చదనాన్ని పంచుతున్న చెట్లు

వంగ్దల్ గైర్వార్ తండా సందర్శన

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వంగ్దల్ గైర్వాన్ తండాను ఆర్డీఓ అశోక చక్రవర్తి సందర్శించారు. తండాకు రోడ్డు, వాగుపై వంతెన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు ఇటీవల జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ అశోక చక్రవర్తి సోమవారం తండాను సందర్శించారు. తండా రోడ్డు, వాగుపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం తండాలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నారు. తండా సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సజీంఖాన్, ఆర్ఐ మదన్ తండావాసులు ఉన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ, తదితరులు

క్లుప్తంగా

సైనిక ఫండ్‌కు విద్యార్థుల విరాళం



డీఈఓకు డీడీని అందజేస్తున్న విద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): దేశ సరిహద్దుల్లో కాపలా కాసే సైనికులకు మేమున్నామని భరోసా కల్పిస్తూ మండలంలోని నిజాంపూర్(కె) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హెచ్ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో సైనిక్ ఫండ్ సంక్షేమ నిధికి విరాళాలు సేకరించారు. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు నవనీత, సునీత, హెచ్ఎం రామకృష్ణ తనవంతుగా విరాళం అందజేశారు. మొత్తం నగదును బ్యాంకులో డీడీ తీసి డీఈఓ వెంకటేశ్వర్లు చేతులమీదుగా సైనిక్ ఫండ్ కార్యాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచి విద్యతో పాటు సంస్కారం, దేశభక్తి, సమాజ సేవ కలిగి ఉండాలన్నారు. హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి వెంకటేశం, విద్యార్థులు అమాన్ మోసిన్, ఘన సింధు, ప్రణతి పాల్గొన్నారు.

నేటి జన జాతరను జయప్రదం చేయండి

నారాయణఖేడ్: జిల్లా కేంద్రం సంగారెడ్డిలో మంగళవారం నిర్వహిస్తున్న పూలే, అంబేడ్కర్ జన జాతరను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల స్ఫూర్తితో భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. జన జాతర సందర్భంగా ఆట, పాట, సాంస్కృతిక కార్యక్రమాలు, నాయకుల ఉపన్యాసాలు ఉంటాయని అన్నారు. ముఖ్య అతిథులుగా అంబేడ్కర్ వాది జేబీ రాజు, బహుజన వాగ్గేయ కారులు ఏపూరి సోమన్న, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు హాజరవుతారని అన్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు మోషప్ప పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 19 మంది అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 7మందికి రూ. 1500 చొప్పున, ఇద్దరికి రూ.1000 చొప్పున, మరో ఐదుగురికి రూ .2 వేల, నలుగురికి రూ. 500 జరిమానా విధించారు. అలాగే, మరో వ్యక్తికి జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నలుగురిపై కేసు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్‌లో ఎస్ఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

మునిపల్లి(అందోల్): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు. లారీ లోడ్‌తో ఇస్మాయిల్‌ఖాన్ పేట నుంచి కర్నాటకలోని బీదర్‌కు ప్రయాణిస్తుండటంతో కంకోల్ టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు.

మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: నీటి కుంటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ నుంచి బచ్చగూడెం వచ్చేదారిలో లీక్ వెంచర్ వెనకాల నీటి కుంటలో గుర్తుతెలియని వ్యక్తి పడి మృతిచెంది కనిపించాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్ చెరు పోలీసులను సంప్రదించాలన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రూ.10.47 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక చొరవ

న్యాల్‌కల్(జహీరాబాద్): జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలో రూ. 10.47 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో ఆయా గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు దాదాపు పూర్తి కావొచ్చాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కోహీర్ మండలానికి రూ. 88 లక్షలు, ఝరాసంగంకు రూ.1 కోటి, న్యాల్‌కల్‌కు రూ. 1.60 కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జహీరాబాద్ మండలంలోని ఎనిమిది గ్రామాలకు రూ.1.19 కోట్లు, మొగుడంపల్లి మండలంలోని 18 గ్రామాలు, తండాలకు రూ. 1.10 కోట్లు, న్యాల్‌కల్ మండలంలోని 14 గ్రామాలకు రూ. 1.10 కోట్లు, ఝరాసంగం మండలంలోని 10 గ్రామాలకు రూ. 50 లక్షలు, కోహీర్ మండలంలోని పలు గ్రామాలకు రూ. 40లక్షలు చొప్పున మంజూరు చేయించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు కూడా జహీరాబార్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాలకు రూ. 50 లక్షలు చొప్పున రూ. 2 కోట్లు మంజూరు చేయించగా, న్యాల్‌కల్ మండలానికి రూ. 70 లక్షలు కేటాయించారు. దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు పూర్తి కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దూరమయ్యాయి.



మిర్జాపూర్(ఎన్)లో వేసిన సీసీ రోడ్డు

రూ.12 కోట్లతో ఇండోర్ సబ్‌స్టేషన్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్న లక్ష్యంతో పటాన్‌చెరులో రూ.12 కోట్ల అంచనా వ్యయంతో 33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీసు ప్రాంగణంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మొదటిసారిగా పటాన్‌చెరులో ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. పాశమైలారం నుంచి నేరుగా నూతన సబ్‌స్టేషన్‌కు ప్రత్యేక లైను వేయడంతో పాటు పటాన్‌చెరు, రామచంద్రాపురం పట్టణాలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్‌లో రూ.100 కోట్ల అంచనా వ్యయంతో 132 కేవీ సబ్‌స్టేషన్‌కు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, విద్యుత్ శాఖ ఏడీఈలు సంజీవ్, నాగరాజు, రవికాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

సైబర్ నేరాలపై అవగాహన

కంగ్టి(నారాయణఖేడ్): అపరిచితుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే తొందరపడి ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని పోలీసులు సూచించారు. కంగ్టి మండల కేంద్రంలో సోమవారం పోలీసులు యువకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. తెలియని నంబర్ నుంచి ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. బ్యాంకు నుంచి మెసేజ్ అంటూ మీ ఏటీఎం గడువు ముగిసిందని.. ఓటీపీ చెప్పాలని కాల్స్ చేస్తే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మీకు ల్యాటరీ వచ్చిందని ఈ నంబర్‌కు కొన్ని డబ్బులు పంపాలని చెప్పినా పోలీసులకు సమాచారం ఇచ్చి సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ పండరి, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

క్రీడాపోటీలను విజయవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గ్రామస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రతి ఏటా అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు , మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ తెలిపారు. సోమవారం తెల్లాపూర్‌లోని ఆయన నివాసంలో మే 4, 5తేదీలలో నిర్వహించే వాలీబాల్, మే 6, 7, 8తేదీల్లో నిర్వహించే కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడాల్లో పాల్గొనే రాష్ట్రస్థాయి క్రీడాకారులకు వసతులు ఏర్పాటు చేయడం జరుగుందన్నారు. వాలీబాల్‌లో మొదటి బహుమతి రూ.99,999, రెండవ బహుమతి రూ. 55,555 నగదు బహుమతి అందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా కబడ్డీలో మొదటి బహుమతి 99,999 రెండవ బహుమతి రూ.55,555, మూడవ బహుమతి రూ.33,333 నగదు బహుమతి అందిస్తున్నామని వివరించారు. క్రీడాలో పాల్గొనే వారికి ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని తెలిపారు. క్రీడాకారులు తప్పనిసరిగా షూ ధరించాలని తెలిపారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భరత్

ఉగ్రవాదాన్ని సమూలంగా నియంత్రించాలి



కొవ్వొత్తులతో గ్రామస్తుల ర్యాలీ

జిన్నారం (పటాన్‌చెరు): పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ గడ్డపోతారం మున్సిపాలిటీలో సోమవారం ముదిరాజ్ సంఘం భవనం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యగా అన్నారు. ఉగ్రదాడిలో అమరులైనవారి ఆత్మకుశాంతి చేకురాలని క్యాండిల్ ర్యాలీ నిర్వహించామన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాలయ్య, పెంటేష్, ప్రదీప్‌రాజు, శివశంకర్, దేవయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయండి

హత్నూర (సంగారెడ్డి): కారును బైకు ఢీకొన్న సంఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని హత్నూరలో సోమవారం ఆందోళన చేశారు. ఆదివారం సాయంత్రం హత్నూర మండలం దేవులపల్లి గ్రామశివారులో బైకును కారు ఢీకొన్న సంఘటనలో చిలిపిచేడ్ మండలం అజ్జమరి గ్రామానికి చెందిన అమృత(45) మృతి చెందిన విషయం తెలిసిందే. మృతురాలి బంధువులు గ్రామస్తులు హత్నూరకు చేరుకొని పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై ఆందోళన చేశారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం సంభవించిందని ప్రాణం కోల్పోయిన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎస్ఐ సుభాష్ సంఘటన స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న బాధిత బంధువులు, గ్రామస్తులు

హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీలో ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలం చెందారని ఆరోపించారు. డ్రైవర్‌లకు ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇవ్వాలని డిమాండ్ కోరారు.

ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వద్దు

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు విధిగా ఇళ్లను నిర్మించుకోవాలని ఖేడ్ రెవెన్యూ డివిజన్ కార్యాలయ పరిపాలన అధికారిణి (డీఏఓ) ఎస్తేరు అనిత పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్‌లో పర్యటించి ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు. అలాగే, నిజాంపేట్ మండలంలో ఎంపీడీఓ సంగ్రాం ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించారు. కాల్వోని కుంట తండా, ఖానాపూర్ (బి), నాగోనికుంట, శెకల్ కుంట తండా, నాగ్‌ధర్, కొత్తపల్లి, రాంరెడ్డి పేట్ గ్రామాల్లో పర్యటించి విచారణ చేశారు. కొత్తపల్లిలో మండలంలో మొత్తం 340 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని వారికి సూచించారు.

ఇళ్ల పనుల పరిశీలన

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం ఖానాపూర్(బి), నాగనికుంట తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులపై ఎంపీడీఓ సంగ్రామ్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి, చిట్కుల్, ఇస్నాపూర్ గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించి.. ప్రజలకు మంచినీటిని అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మిషన్ భగీరథ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ముత్తంగి, ఇస్నాపూర్ గ్రామాల పరిధిలో చేపడుతున్న పనుల మూలంగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోవడంతో ప్రజలకు మంచినీటి సరఫరా విషయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారులు ఎమ్మెల్యేకి దృష్టికి తెచ్చారు. తాత్కాలిక ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సరఫరాను ప్రారంభించాలని ఆదేశించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటు అవుతున్న కాలనీల్లో నూతన మంచినీటి ట్యాంకుల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మిషన్ భగీరథ స్థానిక అధికారులు ప్రతి రోజు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని కోరారు. రామేశ్వరం బండ గ్రామ పరిధిలోని వీకర్ సెక్షన్, ఇంద్రపురి కాలనీల్లో జనాభాకు అనుగుణంగా మంచినీరు రావడంలేదని.. వెంటనే సరఫరాను పెంచాలని ఆదేశించారు. దీంతో పాటు ఇంద్రేశం సత్యసాయి వాటర్ పంప్‌హౌస్ సమీపంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఇ రఘువీర్, ఈఈ విజయలక్ష్మి, డీఈలు సుచరిత, శ్రీనివాస్, మున్సిపల్ ఏఈ మౌనిక పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహిపాల్ రెడ్డి

దత్తగిరిలో మహా రుద్రయాగం

ఝరాసంగం(జహీరాబాద్): లోక కళ్యాణార్థం, దేశం సురక్షితంగా ఉండాలని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో మహా రుద్రయాగాన్ని ప్రారంభించారు. సోమవారం ఆశ్రమ పీఠాధిపతి 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహరాజ్, మహా మండలేశ్వర్ డాక్టర్ సిద్ధేశ్వర స్వామిల ఆధ్వర్యంలో ఆశ్రమ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపంలో యాగాన్ని ప్రారంభించారు. గణపతి పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, పూర్ణాహుతి మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేశానికి దుష్ట శక్తుల నుంచి విముక్తి కలిగేంత వరకు యజ్ఞం కొనసాగుతుందని పీఠాధిపతులు స్పష్టం చేశారు. పూజా కార్యక్రమాల్లో స్థానిక ఎస్సై నరేష్ హాజరై పూజలు చేశారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాతశ్రీ అనసూయ మాత, వైదిక పాఠశాల విద్యార్థులు, పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆశ్రమ పీఠాధిపతులు

మేడే ఉత్సవాలు జయప్రదం చేయాలి

నారాయణఖేడ్: జిల్లాలో మే 1న నిర్వహించే మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆనంద్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే ఉత్సవాల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో వంటవార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. సంఘం నాయకులు చిరంజీవి, దత్తురెడ్డి, అశోక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మర్వెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 సంవత్సరంలో పదవతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సుమారు 17 ఏళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపైకి వచ్చి అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను పూలమాల. శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, కందర్ప, మాణిక్‌రావు, లవకుశం, రవీందర్, శైలజ, గౌసొద్దీన్, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, నాగరాజు, సతీష్, సంతోష్, ప్రవీణ్, విశ్వేశ్వర్, పాండు, అశ్విని, స్వాతి, పద్మ, సుకన్య, సోని, అనిల్‌కుమారగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చెక్కుల అందజేత

రాయికోడ్ (అందోల్): రాయికోడ్‌లోని రైతు వేదికలో సోమవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గ్రంథాలయాల సంస్థల చైర్మన్ జి.అంజయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేసిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ కుమార్,నాయకులు ఉన్నారు.

◆ ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమల్లో సోమవారం పని వద్ద భద్రత, ఆరోగ్యం ప్రపంచ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. భెల్ ఈడీ కే.బి.రాజా, పీఈఅండ్ఎస్‌డీ యూనిట్ ఈడీ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన చిత్రలేఖన, వ్యాసరచన, హౌస్ కీపింగ్ పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భెల్ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

◆ ఓడీఎఫ్‌లో రక్తదాన శిబిరం

కంది(సంగారెడ్డి): మండలంలోని ఎద్దు మైలారం ఆయుధ కర్మాగారం (ఓడీఎఫ్)లో అఖిల భారత నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంఘం 93వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన శిబిరంలో 35మంది రక్తదానం చేసినట్లు సంఘం ఓడీఎఫ్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఓడీఎఫ్ సీజీఎం శివశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. రక్తదానం చేసిన వారి సేవాస్ఫూర్తి కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఆర్ జనరల్ మేనేజర్ విజయ్ దత్, పీఎంఓ సతీష్, సంఘం నాయకులు అజయ్, జయవర్ధన్‌రెడ్డి, బషీరుద్దీన్ దుర్గయ్య, కేశవరెడ్డి పాల్గొన్నారు.

◆ నేడు మెగా రక్తదాన శిబిరం

నారాయణఖేడ్: బసవ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఖేడ్‌లో ఉచిత మెగా రక్తదాన, వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వీరశైవ లింగాయత్ బసవసేన బాధ్యులు తెలిపారు. బసవ మండపంలో ఉ. 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని కోరారు.

◆ అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నందికంది అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పకుండా పంపించాలని తల్లిదండ్రులను కోరారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా చిన్నారులు ప్రత్యేక దుస్తులు ధరించారు. విద్యార్థులకు మెడల్స్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

◆ దేవాలయ భూములను కాపాడండి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలోని భ్రమరాంబిక దేవాలయ భూములు కబ్జాకు గురవుతున్నాయని బీరంగూడ పాత గ్రామపెద్దలు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను పథకం ప్రకారం కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 993లో ఉన్న ప్రభుత్వ భూమిని పట్టాభూముల దస్తావేజులు చూపుతో కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. దేవాదాయ, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. బీరంగూడ గ్రామం పెద్దలంతా సోమవారం ఆలయం ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా అంతా కలిసి పోరాటం చేయాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆడెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.